‘అలర్జీ’ని వదిలేయొద్దు

- జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం
- నేడు అలర్జీ డే
- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ప్రత్యేక చికిత్స

6లో



సిక్కోలు జీడికి జాతీయ గుర్తింపు





- ఈనెల 14న ఢిల్లీలో అవార్డు ప్రదానం
- ఏపీ ఉద్యాన రంగానికే మైలురాయి
- తితలీ నష్టం తర్వాత పునరుజ్జీవం
- ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఊపు

జీడి మామిడి.. ప్రధాన జీవనాధార పంట..

జిల్లాలో జీడి పంట ప్రధాన జీవనాధారంగా ఉంది. 24,000 హెక్టార్లలో జీడిమామిడి సాగు అవుతోంది. ఇందులో 22,000 హెక్టార్లు దిగుబడినిచ్చే తోటలే. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట వంటి ఉద్దానం మండలాల్లో జీడిమామిడి అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ తోటల్లో సంకరజాతి రకాలైన బీపీపీ-8, బీపీపీ-6, వీ-4 వంటి అధిక దిగుబడినిచ్చే రకాలే కాకుండా వంశపారంపర్య జాతులూ ఉన్నాయి. ఈ పంట ద్వారా 1,05,000 కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగాను జీవనం దొరుకుతోంది. వీరిలో సన్నకారు రైతులు 31,000, చిన్న రైతులు 56,000, పెద్ద రైతులు 18,000 మంది ఉన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఈ పంట రైతులకు స్థిర ఆదాయాన్ని కలిగిస్తోంది.

శ్రీకాకుళం, జూలై 7(ఆంధ్రజ్యోతి): సిక్కోలు జీడిపప్పుకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఉద్యాన రంగంలో వన్ డిస్ట్రిక్ట్ (ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా 'జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు (2025) దక్కింది. ఈ నెల 14న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ హాజరయ్యే అవకాశం ఉంది. ఈ ఘనత జిల్లాకే కాకుండా ఆంధ్రప్రదేశ్ ఉద్యానరంగానికే ఒక మైలురాయి అని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారీ నష్టాల నుంచి పునరుజ్జీవం వైపు..

2018 అక్టోబరులో వచ్చిన తితలీ తుపాను వల్ల జిల్లాలోని ఉద్యాన పంటలు భారీ నష్టాన్ని చవిచూశాయి. అయితే ఈ విపత్తును అవకాశంగా మార్చుకుని ఉద్యానశాఖ పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా 23వేల ఎకరాల్లో పాత తోటలను పునరుద్ధరణ చేయడం, 7,500 ఎకరాల్లో అధిక దిగుబడినిచ్చే కొత్త జీడి తోటల ఏర్పాటు, అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా మరో 7,500 ఎకరాల్లో సాగు విస్తరణ చేశారు. ఈ కార్యక్రమానికి రూ.14.60 కోట్లు ఖర్చు చేయగా.. రైతులకు సబ్సిడీ, సాంకేతిక సహాయం, శిక్షణ అందించారు.

ప్రాసెసింగ్ పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి

ఉద్యానశాఖ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనపైనా ప్రత్యేక దృష్టి సారించి ఎంఐడీహెచ్, ఆర్కేవీవై ద్వారా ఇప్పటివరకు 25 ప్రాసెసింగ్ యూనిట్లను ఆధునీకీకరించి సబ్సిడీ మంజూరు చేసింది. ప్రస్తుతం 9 యూనిట్లకు నిధుల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. ఎంఎస్ఎంఈ డే, కాజూ ఎక్స్ పో (పలాస) వంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలోని రైతులు, వ్యాపారులు, ప్రాసెసర్లు తమ ఉత్పత్తులను దేశవాళీ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసుకున్నారు. ఇది వారికి మార్కెట్ అవకాశాలు పెంచడంలో కీలకంగా నిలిచింది. అంతేకాక ఆధునిక (మిగతా 6వ పేజీలో..)

జిల్లా అధికారుల అంకితభావానికి దక్కిన గౌరవం

ఓడీఓపీ ప్రాజెక్టును విజయవంతంగా నడిపించి జాతీయ స్థాయి అవార్డు పొందడంలో సఫలమైన ఉద్యాన యంత్రాంగానికి అభినందనలు. జిల్లా అధికారుల అంకితభావానికి దక్కిన గౌరవం ఇది. జిల్లాలో ఉన్న ప్రతి జీడి రైతు, జీడి ఆధారిత పరిశ్రమకు ఈ అవార్డు అంకితం. ఉద్యానశాఖ అందిస్తున్న వివిధ పథకాలు, వారి సాంకేతిక మార్గదర్శకత్వం వినియోగించుకుని రైతులు సాగు విధానాలను అభివృద్ధి చేసుకుంటూ స్థిర ఆదాయాన్ని సాధించాలి.

\- స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

ఒకటో తరగతిలోనే వేయండి



- ఎల్‌కేజీ, యూకేజీలో వద్దు
- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై పిల్లల తల్లిదండ్రుల ఒత్తిడి
- తల్లికి వందనం పథకం కోసం ఆరాటం

మెళియాపుట్టి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసమాళ గ్రామానికి చెందిన ఓ పిల్లాడికి నిండా ఐదేళ్లు నిండలేదు. కానీ, ఆ పిల్లాడి తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లి తమ బాబుని ఒకటో తరగతిలో చేర్చుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. అందుకు ఆ స్కూల్ యాజమాన్యం అంగీకరించలేదు. యూకేజీ, ఎల్‌కేజీ చదివిన తరువాతే ఒకటో తరగతికి పంపిస్తామని చెబుతున్నా ఆ బాలుడి తల్లిదండ్రులు వినడం లేదు. ఇక్కడ చేర్చుకోకపోతే వేరే స్కూల్‌లో తమ బాబుని చేర్పిస్తామని వారు అనడంతో సంబంధిత స్కూల్ యాజమాన్యానికి ఏమిచేయలో తెలియని పరిస్థితి నెలకొంది. తల్లికి వందనం పథకం వస్తుందనే ఆశతో ఆ తల్లిదండ్రులు తమ పిల్లాడిని ఒకటో తరగతిలో చేర్పించాలని పట్టుబడుతున్నారని తెలియడంతో ఆ స్కూల్ యాజమాన్యం అవాక్కైంది. ఈ పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల ఉంది. ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.13వేలు చొప్పున జమ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుంది. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు వర్తించదు. దీంతో, తల్లికి వందనం పథకం పొందేందుకు కొందరు తల్లిదండ్రులు ఐదేళ్లు నిండని తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు తీసుకెళ్లి వారిని ఒకటో తరగతిలో చేర్పించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల వివరాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లల వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఇదీ వరకే నమోదై ఉన్నాయి. ఇలాంటి వారిని ఒకేసారి ఒకటో తరగతిలో చేర్పిస్తే తెలిసిపోతుంది. అందుకే దీనికి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించడం లేదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతున్నా వినిపించుకోవడం లేదు. పిల్లల వయసును బట్టి తరగతుల్లో చేర్పించాలనే అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు వయసు గల పిల్లలు సుమారు 40,766 మంది వరకు ఉన్నారు.

పేకాట అడ్డా





- జిల్లాలో పలుచోట్ల శిబిరాలు
- చేతులు మారుతున్న రూ.లక్షలు
- బడాబాబులే ఎక్కువమంది
- రాజకీయ నాయకుల ప్రమేయం
- పోలీసుల దాడులతో ఫలితం ఏదీ?

శ్రీకాకుళం క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పేకాటకు అడ్డాగా మారింది. కొండలు, గుట్టలు, తోటలు, లాడ్జీలు, అపార్ట్‌మెంట్లు, పొలాలు, కోళ్ల ఫారాలు, పారిశ్రామిక భవనాలు.. ఇలా అన్నింటినీ పేకాటరాయుళ్లు తమ స్థావరాలుగా మార్చేశారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నడుస్తున్నాయి. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఇది తారస్థాయిలో ఉంటుంది. కొన్ని చోట్ల ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ ఆట కొనసాగుతుంది. ప్రతిరోజూ రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. చాలాచోట్ల అధికార, ప్రతిపక్ష నేతలకు ఇందులో ప్రత్యక్ష ప్రమేయం ఉండగా, మరికొన్ని చోట్ల వారి అండదండలతో కొందరు పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను నిర్వాహకులు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. అందులోనే ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తారు. ఫలానా ప్రాంతానికి రావాలని సూచిస్తుంటారు. అక్కడే మందు, విందు అన్ని ఏర్పాటు చేస్తుంటారు. పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే, అనుమానం రాకుండా అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. పేకాట కారణంగా చాలా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. కొందరు ఆర్థికంగా చితికిపోయి పచ్చని కాపురాలను గుల్ల చేసుకుంటున్నారు.

జోరుగా రమ్మీ...

శ్రీకాకుళం నగరంలో కొందరు బడాబాబులు రమ్మీ ఆడుతున్నట్టు (మిగతా 6వ పేజీలో)

- ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళం లక్ష్మీ థియేటర్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తుండగా ఒకటో పట్టణ పోలీసులు దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని వారినుంచి సుమారు రూ.11 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు కూడా నమోదు చేశారు. ఈ ఫంక్షన్ హాల్ ఓ మాజీ ప్రజాప్రతినిధి వియ్యంకుడిది. ఆయనే ఈ పేకాట శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- గతేడాది ఆగస్టు 27న నగరానికి ఆనుకుని ఉన్న కుశాలపురం వద్ద ఓ ప్రముఖ వైద్యుడికి చెందిన గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిలో ప్రముఖ వైద్యుడితో పాటు ఆరుగురు వైసీపీ నాయకులు ఉన్నారు. వీరి నుంచి రూ.3.23 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆరుగురిపైనే పోలీసులు కేసు నమోదు చేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వైద్యుడిని కేసు నుంచి తప్పించారనే విమర్శలు ఉన్నాయి.
- ఈ ఏడాది మేలో పలాస మండలం లొద్దభద్ర పంచాయతీ గోస్తనీలో ఆరుగురు పేకాటరాయుళ్లను పలాస పోలీసులు అరెస్టు చేశారు. రూ.1.40లక్షల నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.
- శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్ వద్ద ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో పోలీసులకు తెలిసే పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఓ వైసీపీ నాయకుడికి చెందిన ఫ్లాట్‌లో నిత్యం పేకాట ఆడుతున్నట్లు సమాచారం. అలాగే డేఅండ్‌నైట్ కూడలి వద్ద ఉన్న ఓ హోటల్‌లో టీడీపీకి చెందిన ఓ నాయకుడు తన మిత్రులతో కలిసి పేకాట ఆడుతున్నట్టు సమాచారం.
- నాలుగేళ్ల కిందట అప్పటి ఎస్పీ అమ్మిరెడ్డి ఆదేశాల మేరకు రణస్థలం తోటల్లో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి లక్షల రూపాయలు స్వాధీనం చేసుకుని రెండు కార్లు సీజ్ చేశారు. రణస్థలంపై పోలీసులు నిఘా ఉండడంతో పేకాటరాయుళ్లు రూట్ మార్చారు. ఇప్పుడు శ్రీకాకుళం, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన గారబందను పేకాట శిబిరాలకు ఎంచుకున్నారు.

10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

- విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్/సోంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ.. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయవచ్చన్నారు. ఆ రోజున అమ్మపేరుతో మొక్కలు నాటడం, ఆటలపోటీలు, సహపంక్తి (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

న్యాయం చేయండి

- అక్రమ బదిలీలతో నష్టపోయాం
- డీఎంహెచ్‌వో కార్యాలయంలో బైఠాయించిన ఏఎన్ఎంలు
- రీ-కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్

అరసవల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో జరిగిన అవినీతి, అక్రమాలతో నష్టపోయామని, తమకు న్యాయం చేయాలంటూ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఎన్ఎంల బదిలీల్లో వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఖాళీలను బ్లాక్ చేసి, వాటిని చూపించకుండా జూమ్ కౌన్సిలింగ్ నిర్వహించారని విమర్శించారు. హడావుడిగా జాబితాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించారని, బదిలీలపై ఫిర్యాదులు వచ్చినా విచారించలేదని వాపోయారు. జీవో-6కు అనుగుణంగా బదిలీలను నిర్వహించాలని, అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని, రీకౌన్సెలింగ్ నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు



ముళ్లతుప్పలు మధ్య ఉన్న వనధన్ వికాస కేంద్రం

అధికారుల తప్పిదం.. గిరిజనులకు శాపం

- కొత్తూరులో తెరుచుకోని వన్‌ధన్ వికాస కేంద్రం
- మరుగునపడిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్
- ముళ్లపొదల మధ్య భవనం
- ఆదాయానికి దూరమవుతున్న ఆదివాసీలు
- యూనిట్ బాగుందంటూ ఫొటోలతో అధికారుల మాయాజాలం

గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి, వారు పండించే అటవీ ఉత్పత్తులకు మార్కెట్‌లో విలువను పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి వనధన్ వికాస కేంద్రాలను (వీడీవీకే) ప్రవేశపెట్టింది. అయితే, కొత్తూరు మండలంలో వనధన్ వికాస కేంద్రం ఏర్పాటు విషయంలో అధికారులు చేసిన తప్పిదం గిరిజనులకు శాపంగా మారింది. గిరిజనులకు దగ్గరగా నెలకొల్పాల్సిన కేంద్రాన్ని వారికి సుదూరంలో ఏర్పాటు చేశారు. యంత్రాలు కొనుగోలులో కూడా అవకతవకలకు పాల్పడ్డారు. అంతదూరం వెళ్లడానికి గిరిజనులు ఇష్టపడకపోవడంతో వీడీవీకే తెరుచుకోవడం లేదు. ఫలితంగా ఆ కేంద్రంలోని జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ మరుగున పడింది. పైగా గిరిజనేతరులను సభ్యులుగా చేర్చడంతో అసలైన ఆదివాసీలు నష్టపోతున్నారు. అధికారులు మాత్రం యూనిట్‌ను సక్రమంగా నడుపుతున్నట్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి మాయాజాలం చేస్తున్నారు.

కొత్తూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొత్తూరు సమీపంలో మూడేళ్ల కిందట ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన వనధన్ వికాస కేంద్రం (వీడీవీకే) ప్రస్తుతం మూలకు చేరింది. ఏడాదిగా వీడీవీకే తెరుచుకోవడం లేదు. దీంతో ఈ కేంద్రంలో నెలకొల్పిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ పని చేయకపోవడంతో గిరిజనులు ఆదాయానికి దూరమవుతున్నారు. వాస్తవంగా ఈ కేంద్రాన్ని గొట్టిపల్లి పంచాయతీ పుల్లగూడలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, వెలుగు అధికారులు మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా కొత్తూరు సమీపంలో ప్రారంభించారు. ఈ కేంద్రంలో గొట్టిపల్లి వీడీవీకే, ఇరపాడుగూడ వీడీవీకేకు చెందిన 300 మంది మహిళా సంఘాల సభ్యులను చేర్చి (మిగతా 6వ పేజీలో)

వినతులు పెండింగ్ ఉండకూడదు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో

అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రేపు టెక్కలిలో సీజీఆర్ఎఫ్

7లో

ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా నిరసన

8లో

అలర్జీని వదిలేయొద్దు





- జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం
- నేడు వరల్డ్ అలర్జీ డే
- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స

శ్రీకాకుళం రిమ్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అలర్జీ అనేది చాలా మందికి ఏదో ఒక రూపంలో అనుభవమే. తుమ్ములు, దగ్గు, ఒంటినిండా దద్దుర్లు వచ్చి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. చికాకు కలిగిస్తుంటాయి. అవగాహన లేకపోవడం.. దీనిని తేలిగ్గా తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యగా మారే అవకాశం ఉంది. అలర్జీపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఏటా జూలై 8న అలర్జీ నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. అలర్జీ గురించి తెలుసుకుని జాగ్రత్త పడడమే దీని ముఖ్య ఉద్దేశం.

అలర్జీ అంటే

వెలుపల నుంచి వచ్చే కొన్ని పదార్థాలను శరీరం తట్టుకోలేని స్థితిని అలర్జీ అంటారు. వీటిని అలర్జీ కారకాలు లేదా అలర్జెన్స్ అంటారు. మన శరీరంలోకి అవి ప్రవేశించినప్పుడు మన రోగ నిరోధక వ్యవస్థ వాటిని శత్రువులు అనుకుని అతిగా స్పందిస్తుంది. ఈ అతి స్పందనే అలర్జీ లక్షణాలకు దారితీస్తుంది. ఉదాహరణకు కొందరికి పుప్పొడి రేణువుల వల్ల తుమ్ములు వస్తే.... మరికొందరికి వేరుశెనగ తింటే దద్దుర్లు వస్తాయి. ఇక్కడ పుప్పొడి, వేరుశెనగ అలర్జీ కారకాలు అన్న మాట.

ఎందుకు వస్తాయంటే..

వాతావరణ కాలుష్యం: వాహనాల పొగ, పరిశ్రమల నుంచి వచ్చే వాయువులు, దుమ్మూ ధూళి వంటివి శ్వాసకోశ అలర్జీలకు ప్రధాన కారణం.

పుప్పొడి: కొన్ని మొక్కల పువ్వుల నుంచి వచ్చే పుప్పొడి రేణువులు గాలిలో కలిసి అలర్జీని కలిగిస్తాయి. వసంత రుతువులో ఇవి ఎక్కువగా అలజడిని కలిగిస్తాయి.

పెంపుడు జంతువులు: కుక్కలు, పిల్లుల బొచ్చు కూడా కొందరిలో అలర్జీలకు కారణమవుతుంది.

ఆహార పదార్థాలు: పాలు, గుడ్లు, వేరుశెనగ, గోధుమలు, చేపలు, కొంతమందికి అలర్జీని కలిగించే ఆహారాలు.

రసాయనాలు: కొన్ని రకాల కాస్మెటిక్స్, డిటర్జెంట్లు, మెటల్స్ (నగల్లో నికెల్ వంటివి) చర్మ అలర్జీకి దారితీస్తాయి.

బూజు: (మోల్డ్) తేమ ఉన్న ప్రదేశాల్లో పెరిగే బూజులోని శిలింధ్రాలు కూడా అలర్జీకి కారణమవుతాయి.

దుస్తులు: ఉన్ని లేదా సింథటిక్ దుస్తులు కొందరికి చికాకు కలిగిస్తాయి. కొన్నిసార్లు దుస్తులకు వాడే రంగులు లేదా వాటిని ఉతకడానికి వాడే డిటర్జెంట్లు కూడా అలర్జీకి కారణమవుతాయి.

- కొన్ని రకాల యాంటీబయోటిక్స్ వంటి మందులు లేదా క్రీములు వాడినప్పుడు కొందరికి చర్మ అలర్జీలు వస్తాయి.
- కొంతమందిలో అలర్జీలను కలిగించే ఆహారం తిన్నప్పుడు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, ఒంటిపై దద్దుర్లు, ఒక్కొక్కసారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కూడా వస్తాయి.

లక్షణాలు ఇవే

అలర్జీల వల్ల ఎక్కువ మందిలో జలుబు, తుమ్ములు, ముక్కుకారడం, ముక్కు దిబ్బడ, గొంతునొప్పి, దగ్గు, చర్మంపై దద్దుర్లు, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ముందు జాగ్రత్తలు అవసరం



అలర్జీలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అకస్మాత్తుగా వచ్చే అలర్జీలు ఒక్కోసారి ప్రాణాంతకమవుతాయి. వేరుశనగ ద్వారా వచ్చే అలర్జీలు, సముద్రపు చేపలు ముఖ్యంగా రొయ్యలు, క్రాబ్స్ ఆహారంలో తీసుకున్నప్పుడు కొందరికి తీవ్రమైన అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. ఇటువంటి అలర్జీలలో హఠాత్తుగా గొంతు బొంగురుపోవడం, శరీరంపై దద్దుర్లు, ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తడం, బీపీ అకస్మాత్తుగా పడిపోవడం వంటి తీవ్రమైన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో తక్షణమే వైద్యుని సంప్రదించాలి. తరచుగా అలర్జీలకు గురయ్యే వారు ముందు జాగ్రత్త చర్యగా వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలి. పెన్సిలిన్ వంటి మందులు తీవ్రమైన అలర్జీని కలిగించే అవకాశం ఉంటుంది. రసాయనాల వినియోగం, కొన్ని రకాల కీటకాలు, పులిచీమలు వంటి వి కాటు వేస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. తరచుగా అలర్జీకి గురయ్యేవారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. కొన్ని రకాల ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. అలర్జీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలి.

- డాక్టర్ కె.వెంకటాచలం, అలర్జీ, చర్మవ్యాధి నిపుణులు, రిమ్స్ ఆసుపత్రి, శ్రీకాకుళం

జాగ్రత్తలు తప్పనిసరి

- అలర్జీ దేని వల్ల వస్తుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం దీని నివారణలో తొలి అడుగు.
- ఇంట్లో కర్టెన్లు, కార్పెట్లు తగ్గించి.. బెడ్‌షీట్స్, పిల్లో కవర్లు వేడి నీటితో ఉతకాలి.
- పుప్పొడి ఎక్కువగా ఉండే సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలి.
- బయటి నుంచి వచ్చాక దుస్తులు మార్చుకుని స్నానం చేయాలి.
- అలర్జీని కలిగించే ఆహార పదార్థాల జాబితాను తెలుసుకుని వాటిని పూర్తిగా మానేయాలి.
- పెంపుడు జంతువులు ఉంటే... వాటిని బెడ్‌రూంలోకి రానివ్వకుండా ఉంచడం... వాటికి ఎప్పటికప్పుడు శుభ్రంగా స్నానం చేయించడం ద్వారా అలర్జీ రాకుండా జాగ్రత్త పడవచ్చు.
- చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలర్జీలను నివారించడానికి సాయపడుతుంది.
- దుమ్ము, పుప్పొడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో లేదా వాతావరణంలో కాలుష్యం ఉన్నప్పుడు మాస్క్ ధరించడం వల్ల శ్వాసకోశ అలర్జీలు లేకుండా చేసుకోవచ్చును. శ్రీకాకుళంలోని రిమ్స్‌లో అలర్జీకి చికిత్స అందిస్తున్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు



వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే అర్జీలను సత్వరమే పరిష్కరించి.. బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్య క్రమంలో ఎస్పీ 72 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి.. వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, అర్జీదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలను జూమ్ కాన్ఫరెన్స్‌లో తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేశారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీలకు సంబంధించి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పీ ఆదేశించారు. సోమవారం అందిన అర్జీలలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల గొడవలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాలు తదితర అంశాలపై ఉన్నాయి.

కానిస్టేబుల్ వేధిస్తున్నారు

పోలాకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కానిస్టేబుల్ తనను వేధింపులకు గురి చేస్తున్నారంటూ అదే మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మిరియాపల్లి కృష్ణ సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. జగన్నాథపురంలో తన ఇంటి పక్కన ఉన్న స్థలం తోవను కానిస్టేబుల్ కబ్జా చేశారని ఆరోపించారు. దానిని అడ్డుకునేందుకు ప్రయత్నించినందుకు కొద్ది రోజులుగా తనను వేధిస్తున్నారని తెలిపారు. నరసన్నపేట సీఐ, పోలాకి ఎస్ఐకి ఫిర్యాదు చేసినా కానిస్టేబుల్‌పై చర్యలు చేపట్టడం లేదని తెలిపారు.

వినతులు పెండింగ్ ఉండకూడదు



వృద్ధురాలి సమస్యను వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



గ్రీవెన్స్‌కు హాజరైన అర్జీదారులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్జీలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌పై అధికారులు దృష్టి సారించా లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వ రరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో కార్తీక పౌర్ణమి రోజు (నవంబరు 5)న నిర్వహించే బాలి జాతరకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు ఇవ్వాలని, మహాశివరాత్రి మహోత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నాయుడుగారి రాజశేఖర్ కలెక్టర్‌ను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

సిక్కోలు జీడికి జాతీయ గుర్తింపు

(ఐదో పేజీ తరువాయి)

ప్యాకింగ్, శుభ్రత ప్రమాణాలు, ఎగుమతి సౌలభ్యాలు కలిగిన ప్రాసెసింగ్ సెంటర్లు కూడా నిర్మించారు. సాధారణ జీడిపప్పుతో పాటుగా పుదీనా, చిల్లీ, పెప్పర్ వంటి సుగంధ ద్రవ్యాలు కలిపిన జీడిపప్పు, కాజు బర్ఫీ, వివిధ స్వీట్లు, చిక్కీలు, ఇతర చిరుతిళ్ల తయారీ చేస్తున్న పరిశ్రమలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రా చుర్యం పొందాయి.

శ్రీవారి సేవలో పలాస జీడిపప్పు

శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో పలాస జీడిపప్పు వినియోగిస్తున్నారు. ఇది జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఒక కారణమైంది. పలాస నుంచి ప్రతిరోజూ రోజు సుమారు 3000 కేజీల జీడిపప్పును స్వామివారి వివిధ ప్రసాదాల తయారీ కోసం పంపిస్తున్నారు.

జీడి రైతుల శ్రేయస్సు కోసం శిక్షణ..

రైతులకు ఆర్థిక సాయమే కాక సాంకేతిక శిక్షణ, ప్యాకింగ్ హౌసులు, శీతల గదుల ఏర్పాటు, ఆధునిక వ్యవసాయం, ధరల స్థిరత్వం, నష్ట నివారణ దిశగా అడుగులు వేశారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన కుత్తుమ వేమన్న అనే రైతు ప్యాక్ హౌస్, కొత్త టెక్నాలజీని ఉపయోగించి తన ఆదాయాన్ని రూ.7.6 లక్షల నుంచి రూ. 11.8 లక్షలకు

పల్లెల్లో మొదలైన కృషికి దేశవ్యాప్తంగా గుర్తింపు

ఉద్యాన శాఖ ద్వారా ఓడీఓపీ ప్రాథమిక నివేదికను చేనేత జౌళిశాఖ సహకారంతో 2024 అక్టోబరులో సమర్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర అధికార బృందం పలాస ప్రాంతంలోని జీడి తోటలు, ప్రాసెసింగ్ యూనిట్లను విస్తృతంగా పరిశీలించింది. కలెక్టర్ ఈ నివేదిక స్థితిగతులు తెలుసుకుంటూ అధికార యంత్రాంగానికి సూచనలు ఇచ్చారు. ఈ అవార్డు ద్వారా జిల్లా పల్లెల్లో మొదలైన కృషి దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించింది. ఇది ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

- రత్నాల వరప్రసాద్, జిల్లా ఉద్యాన అధికారి

పేకాట అడ్డా

(ఐదో పేజీ తరువాయి)

సమాచారం. ఒక్కో పేకాట డెన్‌లో రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాకు జమచేసి రమ్మీని నిర్వాహకులు ఆడిస్తున్నారు. దీనికోసం ముందస్తుగానే కొంతమంది వ్యక్తులను ఎంపిక చేస్తారు. ఆ సొమ్మును డ్రా చేసి పోలీసులకు దొరకకుండా వేరే చోట భద్రపరుస్తారు. ప్రణాళిక ప్రకారం రమ్మీ ఆడేవారి పేర్లను పట్టిక రూపంలో తయారు చేస్తారు. గెలిచిన వారికి ఓ ప్రదేశానికి రమ్మంటారు. అక్కడ వారికి ఓ వ్యక్తి సొమ్మును అందిస్తాడు. పలాస, కాశీబుగ్గలో కూడా బడాబాబులే నిత్యం పేకాట ఆడుతున్నట్టు సమాచారం. బంగారు వర్తకులు, జీడిపప్పు వ్యాపారస్తులు ఉండే ఈ పట్టణాల్లో నిత్యం రమ్మీ ఆడుతూ లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది. పోలీసులు తూతూ మంత్రంగానే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికైనా పేకాట స్థావరాలపై పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తోటల్లో పేకముక్క.

శ్రీకాకుళం, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన గారబంద మామిడి, జీడి తోటల్లో యథేచ్ఛగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, నరసన్నపేట, ఒడిశా ప్రాంతాల నుంచి నిత్యం వందల మంది పేకాటరాయుళ్లు ఇక్కడకు వస్తుంటారు. నిర్వాహకులు వారిని ఎవరి కంటా పడనీయకుండా కార్లలో శిబిరాలకు తరలిస్తుంటారు. ఒక్కొక్క కారులో ఐదుగురు చొప్పున పేకాటరాయుళ్లను ఎక్కించుకుని తోటల్లో నిర్వహించే శిబిరాలకు తీసుకెళ్తుంటారు. నిత్యం ఆ ప్రాంతంలో 20 నుంచి 30 కార్లు ఉంటాయి. ఒక కారుకు రూ.5 వేలు కిరాయి అందిస్తుంటారు. అలాగే, పోలీసులు ఈ ప్రాంతానికి వచ్చేటప్పుడు ఆ సమాచారాన్ని అందించేందుకు గాను గ్రామంలోని కొంతమంది వ్యక్తులను నియమించుకుంటారు. దీనికోసం వారికి రూ.2 వేలు సొమ్మును అందిస్తుంటారు. గారబందలో ప్రతిరోజూ రూ.కోట్లలో సొమ్ములు చేతులు మారుతున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. గతంలో శ్రీకాకుళం నుంచి ఒక ప్రత్యేక పోలీస్ టీమ్ గారబందకు వెళ్లి జూదరులను పట్టుకంది. వారిని శ్రీకాకుళానికి తరలిస్తున్న సమయంలో గారబందకు చెందిన కొంతమంది వ్యక్తులు పోలీసులను అడ్డుకున్నారు.

కేసులు నమోదు చేస్తున్నా మారట్లే..

పేకాటరాయుళ్లపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా వారు మారడం లేదు. అపరాధం రుసుం చెల్లించి మళ్లీ జూదం బాటబడుతున్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం చాపురం పంచాయతీ పరిధి బలగ రామగెడ్డ వద్ద గతనెల 17న కొంతమంది పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మరుసటి రోజు కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశాలతో అపరాధ రుసుం చెల్లించి బయటకు వచ్చేశారు. అయితే, రెండు రోజుల తరువాత మళ్లీ అదే వ్యక్తులు, అదే స్థలంలో పేకాట ఆడుతూ రూరల్ పోలీసులకు చిక్కారు. 8 మందిపై ఎస్ఐ రాము కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అందులో ఏడుగురికి 20 రోజుల జైలు శిక్ష, ఒకరికి రూ.200 జరిమానా విధిస్తూ సెకెండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పుచెప్పారు. కోర్టులు విధించే సాదాసీదా అపరాధ రుసుం చెల్లించి బయటకు వచ్చేస్తామన్న ధీమా ఎక్కువ మంది పేకాటరాయుళ్లలో కనిపిస్తుంది.

కేసులు నమోదు చేస్తాం

పేకాట, ఇతర జూదం ఆటలు నిషేధం. ఎవరైనా ఉల్లంఘించి ఆడినా, వాటిని ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవు. పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం. లాడ్జీలు, అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేస్తాం. అవసరమైతే డ్రోన్లను సైతం వినియోగిస్తాం. ఈ విషయంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం.

-కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

అధికారుల తప్పిదం.. గిరిజనులకు శాపం

(ఐదో పేజీ తరువాయి)

జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. కొత్తూరులో యూనిట్ పెట్టడం వలన కొత్తూరు వీడీవీకే సభ్యులను కూడా ఉందులో భాగస్వాములను చేశారు. అయితే, కొత్తూరు వీడీవీకేలో గిరిజనేతరులు ఎక్కువగా ఉన్నారని అప్పట్లో ఆదివాసీలు వ్యతిరేకించారు. అయినా అధికారులు వినిపించుకోలేదు. యంత్రాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అప్పట్లో రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది. కానీ, అధికారులు మాత్రం కొత్త యంత్రాలు కొనుగోలు చేయకుండా సీతంపేటలో ఉన్న పాతవి తీసుకువచ్చి అమర్చారు. ఇందులో కీలకపాత్ర పోషించిన ఓ అధికారిపై అప్పటి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు యంత్రాల కొనుగోలులో అవకతవకలు జరిగినట్లు తేల్చారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను బదిలీ చేసి చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ సక్రమంగా నడవడం లేదు. నిత్యం యూనిట్ సిబ్బంది, అధికారులు మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో యూనిట్ మూతపడే దశకు చేరింది.

జీడిపిక్కల రవాణాకు ఇబ్బందులు..

గొట్టిపల్లి, ఇరపాడుగూడ, లబ్బ తదితర గిరిజన ప్రాంతాలకు కొత్తూరు 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతాల నుంచి కొత్తూరుకు వెళ్లేందుకు ఎలాంటి బస్సులు లేవు. ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలే దిక్కు. అవి కూడా నిత్యం తిరగవు. దీనివల్ల కొత్తూరులోని వనధన్ వికాస కేంద్రానికి జీడిపిక్కలను తీసుకెళ్లేందుకు గిరిజనులు తీవ్ర వ్యయప్రయాసలకు గురయ్యేవారు. రవాణా చార్జీల కింద రూ.100 నుంచి రూ.150 చెల్లించాల్సి వచ్చేది. దీంతో లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంటుండడంతో ప్రాసెసింగ్ యూనిట్‌కు జీడిపిక్కలను తీసుకెళ్లడం లేదని గిరిజనులు చెబుతున్నారు. అదే యూనిట్‌ను తమకు దగ్గరగా ఉన్న పుల్లగూడలో నెలకొల్పి ఉంటే ఎంతో ఉపయోగపడేదని అంటున్నారు. అధికారులు చేసిన తప్పిదం తమకు శాపంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కొత్తూరులోని వనధన్ వికాస కేంద్రం తలుపులు తెరుచుకోకపోవడంతో ఈ ఏడాది గిరిజనులు జీడిపిక్కలను తక్కువ ధరకు వ్యాపారులకు విక్రయించి నష్టపోయారు. ప్రస్తుతం వనధన్ వికాస కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు అల్లుకొని అడవిని తలపిస్తుంది. లక్షలాది రూపాయల విలువైన జీడి ప్రాసెసింగ్ యంత్రాలు మూలకు చేరాయి. అధికారులు మాత్రం యూనిట్‌ను ఎల్లవేళలా తెరుస్తున్నట్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఉన్నతాధికారలను తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై సీతంపేట వెలుగు డీపీఎం ఆర్‌వీ రమణను వివరణ కోరగా 'జీడిపప్పుకు ఆర్డర్ వస్తే కొత్తూరులోని ప్రాసెసింగ్ యూనిట్‌లో తయారు చేసి అందిస్తాం. సమస్యలు ఉంటే పరిష్కారానికి నావంతుగా కృషి చేస్తా.'అని తెలిపారు.



నిరుపయోగంగా యంత్రాలు

పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అరసవల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. అరబిందో కార్మికుల పోరాటంలో నమోదైన కేసులో ఆయన సోమవారం శ్రీకాకుళం న్యాయస్థానంలో హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి అధ్వానంగా ఉందని, నిధుల కేటాయింపు కూడా పెద్దగా లేదని అన్నారు. శ్రీకాకుళంలోని నేరడి ప్రాజెక్టను పక్క రాష్ట్రం ఒడిశాతో సమస్యలను పరిష్కరించుకుని పూర్తి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఊరుకునేది లేదని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన తరువాతనే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదని అన్నారు. ఎయిర్ పోర్టుల నిర్మాణంలో నిర్వాసితులకు న్యాయం చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. బలవంతపు భూసేకరణను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

సమ్మెను విజయవంతం చేయండి

- సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూర్యమహల్ కూడలి మీదుగా ఏడురోడ్ల జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విపరీతంగా ధరలు పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగబోయే సమ్మె కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, రైతు సంఘ అధ్యక్షుడు పి.చంద్రరావు, జేవీవీ నాయకులు కె.అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు టి.తిరుపతిరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, పోస్టల్, మున్సిపల్, బ్యాంకు, పెన్షనర్స్ కళాసీ, రిమ్స్ ఏఆర్ఎస్ తదితర సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

(ఐదో పేజీ తరువాయి)

భోజనాలు ఇలా పండుగ వాతావరణంలో సమావేశాలను నిర్వహించాలని అన్నారు. శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అవార్డు వచ్చిందని కలెక్టర్ వెల్లడించారు. రక్తదానం చేయడానికి రెడ్‌క్రాస్ సొసైటీ లేదా రిమ్స్‌కైనా వెళ్లవచ్చని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని, అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

మీటింగ్ ఇలా..

10వ తేదీ ఉదయం 9 గంటలకు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రారంభమవుతాయి. తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులను పాఠశాలలకు ఆహ్వానిస్తారు. అక్కడ ఏర్పాటు చేసే ఓపెన్‌హౌస్ ఫొటోబూత్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ఫొటో దిగుతారు. అనంతరం తమ పిల్లలతో కలసి వారి తరగతి గదుల్లో తల్లిదండ్రులు కూర్చొనేలా, ఇతర ప్రముఖులు హెచ్ఎం గదిలో ఉండేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతివిద్యార్థి తల్లిదండ్రులతో సంబంధిత క్లాస్ టీచర్ ప్రత్యేకంగా సమావేశమై పిల్లల సమగ్ర పురోగతి కార్డులు(ప్రోగ్రెస్), హెల్త్‌కార్డులు అందిస్తారు. అదేసమయంలో తల్లికి వందనం పథకం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పాజిటివ్ పేరెంట్ మీటింగ్, మనబడి మేగజైన్ తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారు. 11గంటలకు విద్యార్థులతో వారి తల్లులకు పుష్పాలు సమర్పించి పాదాలకు నమస్కరించే కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం తల్లిపేరుతో మొక్కను నాటుతారు. నోటూడ్రగ్స్, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములం అవుతామంటూ సామూహిక ప్రతిజ్ఞ ఉంటుంది. చివరగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఆహ్వానితులు కలసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కార్యక్రమం ముగిస్తారు.

న్యూస్ బాక్స్

దేవాలయానికి విరాళం

కవిటి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కవిటిలో నిర్మితమవుతున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి కవిటికి చెందిన పి.రవిప్రసాద్, ప్రశాంతి దంపతులు విరాళం అందించారు. సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులకు రూ.50వేలు చెక్కు ఇచ్చారు. అలాగే ట్రాక్టరు చిప్స్ లోడును అందజేశారు.

రామావతారంలో జగన్నాథుడు



సోంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ స్వామి రథ యాత్రలో భాగంగా సోమవారం భక్తులకు రామావతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్వోబీ పనులు పూర్తి చేయండి

ఇచ్ఛాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పరిధిలో ఉన్న రైల్వే రోడ్ ఓవర్ బ్రిడ్జిల పనులను సత్వరమే పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరినట్లు జడ్ఆర్‌యూసీసీ సభ్యు డు మెంబర్ శ్రీనివాస్ రౌళో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భువనేశ్వర్‌లోని చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జీహెచ్ విక్టర్ జోసెఫ్‌ను టీడీపీ నేత సదానంద రౌళోతో కలిసి సమస్యలను వివరించామన్నారు.

రైల్వే అండర్‌పాస్‌కు నిధులు

కవిటి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గొర్లెపాడు గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే అండర్‌పాస్ మరమ్మతులకు రూ.6 లక్షలు నిధులు మంజూరైనట్లు జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరౌళో ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే అండర్ పాస్‌కు 1989లో మరమ్మతులు చేసి ఆ తరువాత పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యను కేంద్ర మంత్రి కె.రామ్మో హన్ నాయుడు, ఎమ్మెల్యే, విప్ అశోక్ దృష్టికి తీసుకువెళ్లగా నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

ఎచ్చెర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. పూనేల సెంటర్ ఆఫ్ సోషల్ రీసెర్చ్, డెవల ప్‌మెంట్ సంస్థ ప్రచురించిన సౌత్ ఏసియన్ జర్నల్ ఆఫ్ పార్టిసిపేటివ్ డెవలప్‌మెంట్ ప్రత్యేక సంచికను సోమ వారం ఆవిష్కరించారు. వర్సిటీలో ఈ ఏడాది ఏప్రిల్ 14, 15 తేదీల్లో నిర్వహిం చిన జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలు ఈ జర్నల్‌లో ప్రచురితం అయ్యాన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, వాసవి మహిళా మండలి డైరెక్టర్ డాక్టర్ రష్మి, ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆలిండియా ర్యాంకర్లకు అభినందన

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ ఆలిండియా 21వ ర్యాంకు సాధించి ముంబైలో సీటు పొందిన భరత్ చంద్ర, అలాగే ఆలిండియాలో 256 ర్యాంకు సాధించిన బి.రోహిత్‌దత్‌లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అభినందించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

శ్రీకాకుళం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ నాగరాజు స్పష్టం చేశారు. సోమవారం సూర్యమహల్ జంక్షన్, రామలక్ష్మణ కూడలి వద్ద ఎస్ఐ సుధాకర్‌తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించిన 14 ఆటోలను సీజ్ చేసి ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు నిబంధనలను పాటించాలన్నారు.

ఆనందోత్సాహాల నడుమ ఎన్ఈఆర్ జన్మదిన వేడుకలు



లావేరు: కేక్ కట్ చేసి తినిపిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్



ఎచ్చెర్ల: కేక్‌ను కట్ చేస్తున్న చౌదరి నారాయణమూర్తి తదితరులు

లావేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు జన్మదిన వేడుకలు టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సురేష్ కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్ఈఆర్ పదవి చేపట్టిన తరువాత నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, టీడీపీ నాయకుడు లంకలపల్లి శ్రీనివాసరావు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు జన్మదిన వేడుకలు సోమవారం ఎచ్చెర్లలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, నేతలు పైడి ముఖలింగం, అల్లుపల్లి రాంబాబు, గాడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి మహాలక్ష్మి ఆధ్వర్యంలో నేతలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ● నడుకుదిటివానిపాలెంలోని ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థాపక దినోత్సవం, స్కూల్ చైర్మన్, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు సోమవారం నిర్వహించారు. కేక్ కట్ చేయడంతోపాటు విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊర్మిళ దీక్షిత్, స్కూల్ ప్రెసిడెంట్ బి.రామకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు పాల్గొన్నారు.

ఏడాదిలో అనేక సంక్షేమ పథకాల అమలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు పంపిణీచేసి ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్ పాల్గొంది.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం రూరల్: కార్పొరేషన్ పరిధి పెద్దపాడు గ్రామంలో కరపత్రం ఇచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



ఇచ్ఛాపురం: బలరాంపురంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



ఆమదాలవలస: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



నరసన్నపేట: వీరన్నాయుడు కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



మెళియాపుట్టి: ముక్తాపురంలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



కాశీబుగ్గ: పద్మనాభపురంలో ప్రచారం చేస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు


గ్రామీణ ఉపాధిపై కార్యాచరణ ప్రణాళిక

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదాయ సృష్టి, గ్రామీణ ఉపాధిపై వివిధ శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వ్యవసాయ విస్తరణ, లైవ్ స్టాక్, గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి, లోన్ రికవరీ, రీపేమెంట్లు, వడ్డీ సబ్సిడీ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించామన్నారు. అన్ని మండలాల్లోనూ మోడల్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని, ఈ గ్రూప్‌లు వ్యవసాయ విస్తరణ, గ్రీన్ ఫీల్డ్ వంటి అంశాల్లో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. క్రెడిట్ లింకేజీపి బలోపేతం చేయాలన్నారు. ఉపాధి, ఆదాయవృద్ధికి ముంద డుగు వేయడమే అంతిమ లక్ష్యమన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డ్వామా పీడీ సుధాకరరావు, పశు సంవర్థక శాఖ జేడీ కె.త్రినాథ్, సెరీకల్చర్ అధికారి చంద్రజీవన్, ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



ఇచ్ఛాపురం: బస్టాండ్ కూడలిలో కార్మికుల మానవహారం

శ్రీకాకుళం అర్బన్/ఇచ్ఛాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసిపల్ ఇంజనీ రింగ్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, కల్యాణ అప్పలరాజు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర విభాగం పిలుపుమేరకు సోమవారం శ్రీకాకుళం, ఇచ్ఛాపురంలో నిరసన చేపట్టారు. రిటైరైన మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు జయశ్రీ, రాజ్యలక్ష్మి, మాధురి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

● రేపు టెక్కలిలో సీజీఆర్ఎఫ్

● చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయాధికారి సత్యనారాయణ

శ్రీకాకుళం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కారం కోసం టెక్కలిలో బుధవారం నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయాధికారి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. టెక్కలి సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ వేదికను నిర్వహిస్తున్నామన్నారు. వినియోగ దారులు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖ సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ చేసి న్యాయం చేస్తామని వెల్లడించారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ సదస్సులో కమిటీ సభ్యులు బి.సులేఖారాణి, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారు.

రైస్‌మిల్లు ఆకస్మిక తనిఖీ



బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

బూర్జ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సింగన్నపాలెంలో ఉన్న రైస్‌మిల్లును జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని రికార్డులు, ధాన్యం షైర్ యంత్రాలు, బియ్యాన్ని పరిశీలించారు. రోజుకు వచ్చే ధాన్యం వివరాలు, మిల్లు కెపాసిటీ తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైస్ గోదాములను పరిశీలించారు. గోదాములను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

రణస్థలం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎరువులు కృత్రిక కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు హెచ్చరించారు. కోష్ట, రావాడ, రణస్థలంలో ఎరువుల దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల నిల్వ, విక్రయాలపై ఎప్పటికప్పుడు వ్యవసాయ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. షాపుల ఎదుట విత్తనాలు, ఎరువుల వివరాలకు సంబంధించిన బోర్డులు ఉంచాలన్నారు. ఆయనతో పాటు ఏవో విజయభాస్కర్ ఉన్నారు.

ఆక్రమణలను తొలగించండి

జి.సిగడాం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని కొందరు ఆక్రమిం చారని, ఆక్రమణలను తొలగించాలని కళాశాల ప్రిన్సి పాల్ మైలపల్లి శ్రీనివాసరావు తహసీల్దార్ ఎ.సరితను కోరారు. కోరారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మైదానాన్ని ఆక్రమించడంతో విద్యార్థులు ఆటలాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్, గ్రామస్థులు మజ్జి కన్నంనాయుడు, కోన వెంకటరావు తదితరులతో కలిసి వినతి పత్రం అందించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. కళాశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గుజరాతీపేటలో మారు రథయాత్ర

శ్రీకాకుళం కల్చరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుజరాతీపేటలో జగన్నాథ మారు రథయాత్ర సోమవారం నిర్వహించారు. గుడించా మందిరంలో ఉన్న స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై వేంచేపు చేసి అర్చకుడు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో తిరువీధి నిర్వహించి జగన్నాథ ఆలయానికి తిరిగి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పలువురు భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అలరించిన 'తులసీ జలంధర'



హరికథా గానం చేస్తున్న విశ్వనాథం భాగవతార్

శ్రీకాకుళం కల్చరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాపూజీ కళామందిరంలో శ్రీసు మిత్ర కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హరికథా నవరత్నాలు'లో భాగంగా సోమవారం నెల్లూరుకు చెందిన కొండపల్లి విశ్వనాథం భాగవతార్ 'తులసీ జలంధర' హరికథ అలరించింది. ఈ సందర్భగా హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి శంకర శర్మ, ప్రతి నిధులు మండవిల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, గుత్తు చిన్నారావు, లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి



ఆమదాలవలస, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌లో శ్రీవాసవీ కన్యకా పరమే శ్వరి ఆలయంలో అమ్మవారం సోమవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అర్చకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు ఆత్మకూరు రామకృష్ణ, టి.రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు

● వామపక్ష నేతలు

అరసవల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెకు వామపక్షాలు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐఎంఎల్ లిబరేషన్ కార్యదర్శి తామాడ సన్యాసిరావు, కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు స్థానిక క్రాంతి భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కరోనా సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. దీనివల్ల రోజుకు 8 గంటలకు గాను 10 గంటలకు మార్పు చేశారన్నారు. కంపెనీల యాజమాన్యాలకు స్వేచ్ఛనిస్తూ, కార్మికులను బానిసలుగా మార్చే ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్ పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: బైక్ ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నేతలు



అరసవల్లి: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు



సోంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ల సంఘం..

అరసవల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెలో పెన్షనర్లు పాల్గొంటారని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తి తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సంఘ ప్రతినిధులు పి.సుధాకరరావు, బొడ్డేపల్లి జనార్దనరావు, ప్రగడ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోంపేట, కంచిలి, ఎచ్చెర్ల తదితర ప్రాంతాల్లో సీఐటీయూ, వామపక్షాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఆయా పార్టీల నేతలు, కార్మికులు పాల్గొన్నారు.


క్రయవిక్రయదారులతో సందడిగాఉన్న పూండి సంత

మరుగుదొడ్లు లేవు.. తాగు నీరులేదు

● ఆశీలు వసూలుచేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించని వైనం

● పూండి సంతలో క్రయవిక్రయదారులకు తప్పని అగచాట్లు

వజ్రపుకొత్తూరు,జూలై7(ఆంధ్రజ్యోతి):పూండి వారపుసంతలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా మరుగుదొడ్లు, తాగు నీరు వంటి సదుపాయాలను కల్పించలేదు. ప్రతి గురువారం ఇక్కడ నిర్వహించే వారపు సంతలో ఆశీల రూపంలో లక్షలాది రూపాయలు వసులుచేస్తున్నారు.అయినా పంచాయతీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంపై దృష్టిసారించడంలేదన్న విమర్శలొస్తున్నాయి. ఇక్కడ బ్రిటీష్ పాలనాకాలం నుంచి ప్రతి గురువారం సంత నిర్వహిస్తున్నారు. సంతకు వజ్రపుకొత్తూరు, నందిగాం, సంతబొమ్మాళి తోపాటు పలు మండలాల నుంచి వందలాది మంది వచ్చి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. క్రయవిక్రయదారులకోసం ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో అవస్థల మధ్యే కార్యకలాపాలు చేపడుతున్నారు. మరుదుదొడ్లు లేకపోవడంతో సంతకు వచ్చే మహిళలు ఇబ్బందిపడుతున్నారు. పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే నిలపాల్సివస్తోంది. పంచాయతీ అధికారులు స్పందించి సంతలో వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

దైవ దర్శనానికి వెళ్లి.. లారీ ఢీకొని

● అనకాపల్లి జిల్లాలో బొరిగివలస వాసి దుర్మరణం

నరసన్నపేట, జూలై 7 (ఆంధ్రప్రదేశ్): దైవదర్శనానికి వెళ్లిన బొరిగివలసకు చెందిన రాజాపు గుర్రన్న(52) అనకాపల్లి జిల్లాలో ఆదివారం రాత్రి లారీ ఢీకొన్న సంఘటనలో దుర్మరణంపాలయ్యాడు.దీంతో గ్రామంలో విషాధచాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు.. నరసన్నపేట మండలంలోని బొరిగివలసకు చెందిన రాజాపు గుర్రన్న తుని వద్ద గల తలుపులమ్మ తల్లిదర్శనానికి ఆదివారం గ్రామస్థులతో కలిసి వాహనంలో వెళ్లాడు. అమ్మవారి మొక్కుచెల్లించుకొని తిరిగి అదే వాహనంలో బయలుదేరాడు.మార్గమధ్యలో అనకాపల్లిజిల్లాలోని కశింకోట వద్ద వాహనం నిలిపారు. వాహనం దిగి.. రోడ్డుపైకి వెళ్లిన గుర్రన్నను ఆ మార్గంలో వెళ్లే లారీ ఢీకొనడంతో అక్కడక్కడే మృతిచెందాడు.గుర్రన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..

నరసన్నపేట మండలంలోని ఉర్లాం రైల్వేస్టేషన్ సమీపంలో ఉర్లాం పంచాయతీ కమ్మరిపేటకు చెందిన దువ్వారపు మల్లేసు (70) గుర్తుతెలియని రైలు కింద పడి సోమవారం మృతిచెందాడు. రైల్వేపోలీసుల కథనం మేరకు.. స్టేషన్‌లో 30 అడుగుల దూరంలో పట్టాల పక్కన మల్లేసు మృతదేహం స్థానికులు గుర్తించారు. దీంతో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మల్లేసుకు భార్య పిల్లలు లేకపోవడంతో కొన్నాళ్లుగా ఒంటరిగా గ్రామంలో నివసిస్తున్నాడు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఎచ్చెర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఈనెల ఒకటిన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లింగాలపేటకు చెందిన వంక శ్రీనివాసరావు (42) చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఒకటో తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో శ్రీనివాసరావు పోలీసు క్వార్టర్స్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగివస్తుండగా పాత జాతీయరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో గాయపడిన ఆయన్ను తొలుత శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు

మెళియాపుట్టి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి ఇద్దరి చైన్‌స్నాచర్లను పోలీసులు అరెస్టుచేశారు. ఈ మేరకు మెళియాపుట్టిలో సోమవారం పాతపట్నం సీఐ రామరావు విలేకరులతో మాట్లాడారు.సీఐ కథనం మేరకు..శేఖరాపురానికి చెందిన నక్కా శకుంతల గతనెల 29న పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్తోంది. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న తులం పుస్తెలతాడు తెంపడానికి ప్రయత్నించగా కేకలువేసింది. అయితే పుస్తెలతాడు తెంపుకొని ద్విచక్రవాహనంపై గురండి వైపు వెళ్లిపోయారు. గతఏడాది జనవరిలో జగన్నాథపురానికి చెందిన ఓ మహిళా చెరువులో స్నానానికి వస్తోంది.ఆ సమయంలో మెడలో ఉన్న తులంన్నర పుస్తెలతాడును ఇద్దరు వ్యక్తులు తెంపుకొనిపోయారు. ఈ మేరకు పోలీసులు సోమవారం మెళియాపుట్టిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని చూసి ఇద్దరు వ్యక్తులు పరుగులు తీయడంతో వారిని వెంబడించారు. వీరిని పట్టుకుని ప్రశ్నించారు. గంజాం జిల్లాలోని బరంపురానికి చెందిన బాలకృష్ణ, సుజిత్‌కుమార్ పాడిగా గుర్తించారు.వీరిద్దరు ఇక్కడి జరిగిన ఈరెండు కేసులో ముద్దాయిగా తెలడంతో అరెస్టుచేశారు.వీరి వద్ద నుంచి పోగొట్టుకున్న బంగారంతోపాటు ద్విచక్రవాహనం దొంగతనం జరిగిందని తెలడంతో స్వాధీనంచేసుకుని సీజ్‌చేశారు. వీరిద్దరిని టెక్కలి కోర్టులో హాజరుపరిచారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు, సూర్యం, మోజేశ్వరావు, బాలకృష్ణ, సూర్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

గైడ్‌గా వ్యవహరించి.. గంజాయితో పట్టుబడి

● అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో పట్టుబడిన ఒడిశా వాసి

పాతపట్నం,జూలై7(ఆంధ్రజ్యోతి):పూరిలోనిజగన్నాథాలయంలో గైడ్‌గా వ్యవహరించిన ఒడిశావాసి గంజాయితో ఆంధ్రా-ఒడిశా అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో పట్టుబడ్డాడు. ఈమేరకు పట్టుబడిన వ్యక్తి నుంచి 3.345 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పాతపట్నం పోలీసు స్టేషన్‌లో సీఐ వి.రామారావు విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఒడిశాలోని పూరిబ్లాక్‌లోగలచందనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడామ్మగశిర గ్రామానికి చెందిన రఘునాథ్ జెనా ఆరోతరగతి వరకూ చదువుకున్నాడు. చిన్ననాటి నుంచి మందు, సిగరెట్ వంటి చెడువ్యసనాలకు అలవాటుపడ్డాడు. ఈనేపథ్యంలో వంశపారంపర్యవృత్తిలో భాగంగా పూరి జగన్నాథాలయంలో సందర్శనకు వచ్చే భక్తులకు ఆలయ విశేషాలను వివరిస్తూ గైడ్‌గా వ్యవహరిస్తుంటాడు.ఈక్రమంలో ఒడిశాలోని మునిగూడ గ్రామానికిచెందిన గంజాయి వ్యాపారి కార్తీక్ తాను సరఫరాచేసిన గంజాయివిక్రయిస్తే అధిక మొత్తం ఆర్జించగలుగుతావని ఆశచూపి రంగంలో దించాడు. పూరి ప్రాంతంలో గంజాయికి డిమాండ్ ఉందని, చిన్నచిన్న పొట్లాలు రూ.100కు విక్రయించవచ్చని తెలిపాడు.దీంతో రఘునాథ్‌జెన్నా కార్తీక్‌తో మునిగూడ వెళ్లి రూ.15000కు మూడు గంజాయి దిమ్మలను కొనుగులుచేశాడు. మునిగూడ నుంచి పలుఆటోల్లో ప్రయాణించి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పర్లాకిమిడి నుంచి పాతపట్నం నడుచుకొని వస్తున్నాడు.పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోగల ఆంధ్రా-ఒడిశా అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ముందస్తు సమాచారం మేరకు రఘునాథ్ జెనాను ఎస్ఐ బి.లావణ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పట్టుకున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఎచ్చెర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): అల్లినగరం పంచాయతీ కామర్సు పేటకు చెందిన కోల మల్లేశ్వరరావు ఈనెల2వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన భార్య పార్వతి సోమవారం ఫిర్యాదుచేసినట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఇసుక ట్రైర్ బండికి కూలి పనుల కోసం వెళుతుండే తన భర్త ఆ రోజు పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడని పేర్కొంది. తాను ఉపాధి పనికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి భర్త ఇంట్లో లేడని, సెల్‌ఫోన్‌ను విడిచి బయటకు వెళ్లాడని, అప్పటి నుంచి ఇంటికి రాలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో బియ్యం నాణ్యత పరిశీలన

నరసన్నపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసివలస, వీఎన్‌పురం, సత్యవరం పాఠశాలల్లో సన్నబియ్యం నాణ్యతను సోమవారం సివిల్‌సప్లయ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. సన్నబియ్యంలో పురుగులు ఉన్నట్లు ఇటీవల పలు పాఠశాలల్లో బయటపడడంతో సివిల్ సప్లయ్ అధికారులు బియ్యం పరిశీలించేందుకు క్వాలిటీ బృందాలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ స్టాక్ పాయింట్ ప్రతినిధి శివకుమార్ పాల్గొన్నారు.

● నందిగాం, జూలై 7(ఆంధ్రజ్యోతి): నర్సిపురం, లఖిదాసుపురం, నందిగాం తదితర జడ్పీ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్నబోజన పథకానికి సంబంధించి సరఫరా చేస్తున్న సన్నబియ్యాన్ని జిల్లా పౌరసరఫరాల నాణ్యత అధికారి సంతోష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. బియ్యంలో పురుగులు వస్తున్నాయన్న ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. రెండో విడత వచ్చిన బియ్యం బస్తాల్లోనే లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం వంట నిర్వాహకులతో పలు అంశాలతో మాట్లాడారు. ఆయనతో టెక్కలి సీఎస్‌డీటీ అనీల్‌కుమార్‌పాత్రో, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

'ఫసల్ బీమా'ను వినియోగించుకోవాలి: ఏడీ

పలాసరూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన వినియోగించుకోవాలని వ్యవసాయశాఖఏడీ ఎం.రామారావు తెలిపారు.సోమవారం పలాస వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్, కరువు, అకాలవర్షాలు, వైపరీత్యాల వల్ల దిగుబడు నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించడానికి పంటల బీమాఉపయోగపడుతుందన్నారు. పంటరుణాలు తీసుకున్న రైతులకు నేరుగా బ్యాంకు ద్వారా బీమా నమోదవుతుందని తెలిపారు. పంటరుణం తీసుకోనివారు, కౌలు రైతులునేరుగా రైతు కామన్‌సర్వీస్ సెంటరు లేదా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంటుకు ఆధార్,కౌలుకార్డు, బ్యాంకు వివరాలను అందజేసి నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అర్జీలను పరిష్కరించండి

● గ్రీవెన్స్‌లో సామాజిక సమస్యలపై వినతుల వెల్లువ

ప్రజల నుంచి వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు ఆయా శాఖలకు అందజేసి పరిష్కారం చూపాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కోరారు.టెక్కలిలోని సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సామాజిక సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. అధికారులు, అర్జీదారులతో సోమవారం సబ్‌కలెక్టరేట్ కిటకిటలాడింది. మొత్తం 35 వినతులు అందాయి.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్య పరిష్కరించండి

టెక్కలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఆఫ్‌షోర్ నిర్వాసితులు కోరారు.ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి గ్రీవెన్స్‌లో నిర్వాసితులు వినతిపత్రంఅందజేశారు. పలుసార్లు వినతిపత్రాలు అందజేసినా తమకు న్యాయం జరగడంలేదని నిర్వాసితులు ఐ.కృష్ణారావు, ఎన్.చిన్నారావు, దుర్యోధన తదితరులు ఆర్డీవోకు వివరించారు. తనకు తన కుటుంబసభ్యులు మానసికంగా ఇబ్బందిపెడుతున్నారని లింగాలవలస పంచాయతీ బలరాంపురానికి చెందిన 90 ఏళ్ల అన్నెపు జానకిరామయ్య ఆర్డీవో ఎదుట వాపోయాడు. ఎనిమిది ఎకరాలకుపైగా భూమి ఉందని తెలిపాడు. అలాగే టెక్కలి సర్వమంగళవీధిలో వీధిదీపాలు వెలగడం లేదని, వీధిదీపాలు వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని బసవల గోపాలరావు అర్జీ అందజేశాడు. టెక్కలిలో నీరు సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు లేవని అనీల్‌కుమార్ తదితరులు అర్జీ అందజేశారు.టెక్కలి-తొలుసూరుపల్లి రోడ్డులో రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు జగతిమెట్ట కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని దేవాది యర్రమ్మ తదితరులు కోరారు. తిర్లంగి పంచాయతీ వీఆర్‌కేపురం పరిధిలో పెద్దచెరువు నుంచి పురుషోత్తమ సాగరం వెళ్లే కాలువ ఆక్రమణపై పినకాన చిన్నారావు అర్జీని అందజేశారు. కాగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల విభాగానికి ఆయా శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరయ్యారు. గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో అన్నిశాఖల డివిజన్ స్థాయి అధికారులు హాజరు కావడం విశేషం.


టెక్కలి: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు

● మందస, జూలై7(ఆంధ్రజ్యోతి):మందసలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ బోసిపోయింది. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటరమణ, ఏవో నాగరాజు మాత్రమే హాజరయ్యారు. ఐదుగురు తమ సమస్యలపై వినతులు అందజేశారు.

నరసన్నపేటలో ఇంటింటా కుళాయిలు

నరసన్నపేట, జూలై7 (ఆంధ్రజ్యోతి):నరసన్నపేటలో రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇంటింటా కుళాయిలను ఏర్పాటు చేసేందుకు అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చెప్పారు. సోమవారం దేశవానిపేట వద్ద రూ.53లక్షలతో చేపడుతున్న రక్షితమంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు పనులకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసన్నపేటలో ఇంటింటా తాగునీటిని అందించేందుకు రూ.6.07 కోట్లు జలజీవన్ పథకంలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగ్గు అర్చన, గొద్దుచిట్టిబాబు, కింజరాపు రామారావు, గొలివి రామారావు,తంగి తారకేశ్వరరావు, బోయన సతీష్, బగ్గు రవి, మెయ్య హరి, సరియపల్లి మధు పాల్గొన్నారు.

చదువు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలి

ఎల్.ఎన్.పేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పాటు ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుచున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఈనెల పదో తేదీన ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించి సమాజంలో చదువుకున్న ప్రాధాన్యతపై అవగాహన కలిగించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అధికారులు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు,తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఎంఈవో- 1,2 సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈనెల పదో తేదీన జరగనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఆర్.గడ్డెమ్మ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్‌తో కలిసి అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్వీ. ప్రతాప్, సీఎస్‌డీటి రామచంద్రరావు, ఏపీవో జి. హరిప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

● పోలాకి, జూలై 7 (ఆంధ్రప్రదేశ్):విద్యాసంస్థల్లో ఈనెల పదో తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ పండుగవాతావరణంలో నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ జేడీ, మండల ప్రత్యేకాధికారి కంచరాన రాజగోపాలరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన పలుశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ బట్టపద్మావతి పాల్గొన్నారు.

టిడ్కో గృహాలపై త్వరలో మార్గదర్శకాలు

● పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ రామారావు


టిడ్కో గృహాలపై ఫిర్యాదులు అందజేస్తున్న లబ్ధిదారులు

పలాస, జూలై 7(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలకు సంబంధించి త్వరలో మార్గదర్శకాలు వెలువడనున్నాయని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. సోమవారం పలాసలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మునిసిపాలిటి పరిధిలో పలువురు టిడ్కో గృహాలపై ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ గృహాలు లేకపోయినా బ్యాంకుల నుంచి వడ్డీల కోసం ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయని తెలి పారు. నిర్మించి ఏడేళ్లైనా ఎందుకు తమకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. గ్రీవెన్స్‌లో మొత్తం13 దరఖాస్తులు వచ్చాయి. కాగా మునిసిపాలిటీలోని తొమ్మిదిమంది కార్యదర్శులకు ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, రాజాం పురపాలకసంఘాలకు బదిలీకావడంతో వారికి రిలీవింగ్ ఉత్తర్వులను కమిషనర్ రామారావు అందించారు.

పశుగ్రాసాలతో అధిక పాలదిగుబడి

కోటబొమ్మాళి, జూలై 7(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పశుగ్రాసాలు పండించి శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు మేపితే అధిక పాల దిగుబడి సాధించవచ్చని టెక్కలి పశుసంవర్ధక సహాయ సంచాలకుడు సీహెచ్ నర్సింహులు తెలిపారు. సోమవారం మండలంలోని రేగులపాడు రైతు సేవా కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు పురస్కరించుకుని రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం లక్ష్మీపురంలో పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకులు ఎం.లోకనాధం, పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్, సహాయకులు శంకరరావు, రాంబాబులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా నిరసన


రాంపురం సచివాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు

హరిపురం, జూలై7 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని రాంపురం గ్రామ సచివాలయం వద్ద కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకే వ్యతిరేకంగా బాధిత రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సిబ్బందితోకలిసి రాంపురం, బిడిమి, గంగువాడ గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఎటువంటి ఆందోళనలు చేపట్టవద్దని, నిరసన కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరని తెలిపారు. కార్యక్రమంలో డీటీ రామకృష్ణ, ఆర్ఐ చిన్నారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వంశధార ఆర్‌ఎంసీలో జలకళ

జలుమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) వంశధార ప్రధాన ఎడమ కాలువకు(ఆర్‌ఎంసీ) సాగునీరు విడిచిపెట్టడంతో జలకళ సంతరించుకుంది. ఈనెల రెండో తేదీన హిరమండలం గొట్టాబేరేజీ వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువకు సాగు నీరు విడిచిపెట్టిన విషయం విదితమే.ఆ నీరు ప్రస్తుతం జలుమూరు, పెద్దదూగాం, రాణ వరకు చేరుకుంది.ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభంలోనే కాలువలకు నీరు విడచిపెట్టడంతో రైతులు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. నారుమళ్లు తయారు చేసి దమ్ము చేయడానికి పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు.


జలుమూరు వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువలో ప్రవహిస్తున్న నీరు

కాలువల్లో పూడికల తొలగింపు

టెక్కలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఆదీఆంధ్రావీధి సమీపంలో వంశధార ఈఈ బి.శేఖరరావు పర్యవేక్షణలో కాలువల్లో పూడికలు తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. శివారు ప్రాంతాలకు సాగునీరు వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఈ చర్యలను వేగవంతంచేశారు. దశాబ్దాలు కాలంగా కాలువగట్లు వెంబడి ఉన్న చెట్లను తొలగించారు.

కాలువ పనుల పరిశీలన

నరసన్నపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట వంశధార బ్రాంచ్ కాలువపై(ఎన్‌బీసీ) జమ్ము జంక్షన్, 11 ఆర్ కిల్లాం కాలువ పనులను క్వాలిటీ కంట్రోల్ ఇంజనీరింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఏఈలు తిలక్, శ్రీను, కిరణ్, నరసన్నపేట సబ్ డివిజన్ డీఈఈ రామలక్ష్మి, ఏఈలు శ్యామ్, హరిష్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికే ప్రాధాన్యం: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల భద్రతకు సంబంధించి చర్యలు తీసుకోవాలని...కార్మికుల సంక్షేమానికే ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం పరిశ్రమల భద్రతపై ఆయన సంబంధిత అధికారులతో జూమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. రెండు వారాల్లో జిల్లాలోని అన్ని పరిశ్రమలు సేఫ్టీ ఆడిట్ పూర్తి చేసి, నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదకర పరిశ్రమలు తప్పనిసరిగా ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను తయారు చేయాలని... ఎమర్జెన్సీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని స్పష్టం చేశారు.పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో ఎమర్జెన్సీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి మ్యూచువల్‌ఎయిడ్ కార్యక్రమాలను బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, డిప్యూటీచీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు టెక్కలిలో శోభాయాత్ర

టెక్కలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలపల్లి మదన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా టెక్కలిలో శోభాయాత్ర నిర్వహించనున్నారని పేర్కొన్నారు.


వంశధార ప్రధాన ఎడమ కాలువపై గల వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్న దృశ్యం

రక్షణ గోడలు శిథిలావస్థకు చేరినా.. మరమ్మతులకు నోచుకోక

ఇదీ మాకివలస వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువపై పరిస్థితి

జలుమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి):మాకివలస వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువపై వంతెనపై రక్షణ గోడలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనపై రక్షణ గోడలు లేక శిథిలావస్థకు చేరాయి.ఈనేపథ్యంలో వంతెనపై నుంచి ద్విచక్రవాహనాలు తప్ప కార్లు, జీపులు వెళ్లే అవకాశంలేదు. దీంతో గ్రామంలో అత్యవసర సమయాల్లో వాహనాలు రావాలంటే ఆరు కిలో మీటర్ల దూరం ప్రయాణం సాగించి ఇక్కడకు చేరుకోవాల్సివస్తోంది. ఎన్నికల సమయంలో వచ్చే ప్రజాప్రతినిధులు వంతెనపై రక్షణ గోడల నిర్మాణానికి హామీ ఇచ్చి తర్వాత మరిచిపోతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వారంతా భయాందోళన చెందుతున్నారు. పంట ఉత్పత్తులు కళ్లాలకు చేర్చే సమయంలో అగచాట్లు తప్పడం లేదు.

సీజీఆర్‌ఎఫ్ వాయిదా

టెక్కలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): తొలుసూరుపల్లి రోడ్డులో మంగళవారం జరగాల్సిన విద్యుత్ వినియోగదారుల సదస్సు (సీజీఆర్‌ఎఫ్)బుధవారానికి వాయిదా వేసినట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావ తెలిపారు. ఈఅవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

10న మండల సమావేశం

పోలాకి, జూలై 7 (ఆంధ్రప్రదేశ్): పోలాకి మండల సమావేశం ఈనెల పదో తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దమయంతి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

ఆలయానికి దారి చూపాలి

మెళియాపుట్టి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మూడురోడ్ల కూడలిలో గల మల్లిఖార్జున స్వామి ఆలయానికి దారి చూపించాలని ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యుడు దున్నాశ్రీనివాస్ కోరారు. ఆలయానికి వెళ్లే దారి కొంతమంది ఆక్రమించి షెడ్లను నిర్మిస్తున్నారని సోమవారం శ్రీకాకుళంలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దేవదాయ శాఖ అధికారులను పంపించి పోలీస్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసు, జయముని, గాంధీ, వెంకటమరణ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్స్ రద్దు చేయాలి

టెక్కలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే ల్యాబర్‌కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూనాయకులు నంబూరు షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు కోరారు. సోమవారం టెక్కలిలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బుధవారం జరిగే సమ్మె విజయవంతంచేయాలని కోరారు.కార్మికుల సంక్షేమ కార్యక్రమాలన్నీ పగడ్బందీగా నిర్వహించాలని, ఎనిమిది గంటల పనివిధానాన్నికొనసాగించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక సంఘ నాయకులు ధర్మారావు, రమేష్, పాపారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ పరిశీలన

టెక్కలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని ఆదీఆంధ్రావీధి సమీపంలో అంజనాపురం లేఅవుట్‌ను సోమవారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో 409 ప్లాట్లకు గాను 372మంది హౌసింగ్ రిజిస్ట్రేషన్ చేయగా 110మంది ఇళ్ల కాలనీ బిల్లులు తీసుకున్నట్లు గుర్తించారు. అర్హులందరికీ పట్టాలిచ్చేందుకు అనుకూల పరిస్థితులపై ఆరాతీశారు.తహసీల్దార్ బి.సత్యం, డీటీ రవికుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జనార్దనరావు, బాలారెడ్డి, వీఆర్వో యుగంధర్, దయాశంకర్ లేఅవుట్‌లో పరిస్థితులను ఆర్డీవోకు వివరించారు.

పాడి రైతును ఆదుకోవాలి

పాతపట్నం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో ఆవులు మృతిచెందడంతో బాధిత పాడి రైతును ఆదుకోవాలని తెలుగు యువత మండలాధ్యక్షుడు బి.నరేష్ కోరారు.ఈ మేరకు తహసీల్దార్ నందిగాం ప్రసాదరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ హరిద్వారం గ్రామానికి చెందిన రైతు ఆవుల పెంచి జీవిస్తున్నాడని తెలిపారు. ఆదివారం జరిగిన రైలుప్రమాదంలో ఆవులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారని చెప్పారు.

ఆక్రమణలు తొలగించండి

వజ్రపుకొత్తూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి):పూండి పరిధిలోని గోపాల చెరువులోఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టాలని జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు కోరారు.జనసేన నాయకుల వంశీకృష్ణ చౌదరి, కీలు సునీలవర్మ, తులసీరావు, డిల్లీరావుతో కలిసి చెరువును పరిశీలించారు.

కంది విత్తనాల పంపిణీ

హిరమండలం, జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరాడ గ్రామ రైతు సేవా కేంద్రంలో సోమవారం కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏవో బి.సంధ్య మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల్లో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

పించన్ల సొమ్ముపై చర్యలు తీసుకోండి

పోలాకి, జూలై 7 (ఆంధ్రప్రదేశ్): పోలాకి, ఉరజాం సచివాలయ ఉద్యోగులు పింఛన్ల సొమ్ము ప్రభుత్వానికి చెల్లించకుండా దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవికుమార్‌కు ప్రత్యేకాధికారి రాజగోపాల్ ఆదేశించారు. సోమవారం పోలాకిలో సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్‌అసిస్టెంట్లపై పలుసార్లు మండల సమావేశాల్లో ప్రశ్నిస్తున్నా ఇంతవరకూ వారిపై ఎందుకు చర్యతీసుకోలేదో లిఖితపూర్వకంగా వివరణఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. దీంతో ఆయన స్పందిస్తూ పోలాకి, ఉరజాం వెల్ఫేర్ అసిస్టెంట్లపై చర్య తీసుకుని డబ్బులు వాపసుచేయిస్తానని తెలిపారు.